‘అన్నా క్యాంటీన్’ పేరుతో

ఆక్రమణ



బాధితులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు

చేపలుప్పాడలో టీడీపీ నాయకుడి ఆక్రమణపర్వం



జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో టీడీపీ నాయకులు చదును చేయించిన స్థలం

కొమ్మాది : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతంలో అనధికారిక నిర్మాణాలు, ప్రభుత్వ స్థలం ఆక్రమణలు, అనధికారికంగా మంచినీటి తరలింపు, కొండలు తవ్వి గ్రావెల్ తరలింపు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వీటికి హద్దు లేకుండా పోవడంతో స్థానిక నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఈ అక్రమాలను చూస్తూ రెవెన్యూ అధికారులు కూడా మౌనం వహించడంతో మమ్మల్ని ఎవరు ఆపేది అనే రీతిలో ఆక్రమణదారులు బరి తెగిస్తున్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో భీమిలి బీచ్ రోడ్డు ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం (బే ఆఫ్ బెంగాల్)పై స్థానిక టీడీపీ నాయకుడి కన్నుపడింది. ఎలాగైనా సొంతం చేసుకోవాలనే ఆలోచనతో సోమవారం అర్ధరాత్రి పొక్లెయిన్‌తో చదును చేయించేశాడు.

ఇదే స్థలంలో పలువురు మత్స్యకారులు ఎలక్ట్రికల్ వస్తువులు విక్రయించే దుకాణాలు, చికెన్ సెంటర్లు నడుపుకుంటున్నారు. వారికి ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా బడ్డీలను పక్కకు నెట్టేసి చక్కగా స్థలాన్ని చదును చేయించేశాడు. ఇదేంటని స్థానికులు నిలదీయగా ‘అన్నా క్యాంటీన్’ కోసం స్థలం చదును చేశామని స్థానిక టీడీపీ నాయకులు చెప్పుకొచ్చారు. దీనిపై భీమిలి తహసీల్దార్ టి.గోవింద్‌ను వివరణ కోరగా... జీవీఎంసీ 4వ వార్డులో ఇప్పటి వరకు ఎక్కడా ‘అన్న క్యాంటీన్’ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించలేదని చెప్పడం గమనార్హం. ఒక రెవెన్యూ అధికారి అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలం సుమారు 20 సెంట్లు ఎలా ఆక్రమించేస్తారని స్థానికులు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు మంగళవారం ఉదయం బడ్డీ యజమానులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వ స్థలం సంరక్షించడంతోపాటు తొలగించిన బడ్డీలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం



ఇదే చోట 10 సంవత్సరాల నుంచి చికెన్ సెంటర్ నడుపుతున్నా. సోమవారం రాత్రి దుకాణం మూసుకుని ఇంటి వెళ్లాను. మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి బడ్డీ వేరొకచోట పడిపోయి ఉంది. ఇంతటి దౌర్జన్యం మేమెక్కడా చూడలేదు. ప్రభుత్వ స్థలంలో బడ్డీ పెట్టుకున్నా సరే ఒక రోజు ముందే సమాచారం అందిస్తారు. కానీ ఇక్కడి టీడీపీ నాయకులు కనీస సమాచారం లేకుండా నా బడ్డీని తొలగించడంపై న్యాయ పోరాటం చేస్తాను.

– డి.ఎల్లాజీ, చేపలుప్పాడ

జీవీఎంసీ ఆదేశాలు బేఖాతర్..!

- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై పోస్టర్లు, పబ్లిసిటీ బోర్డులు
- అంబేడ్కర్ విగ్రహాన్నీ వదలని టీడీపీ నాయకులు



తగరపువలస కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీ



ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల పై పోస్టర్లు, బోర్డులు పెట్టకూడదని జీవీఎంసీ హెచ్చరిక నోటీసు

తగరపువలస : ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై పోస్టర్లు, పబ్లిసిటీ బోర్డులు పెట్టకూడదని గతంలో జీవీఎంసీ భీమిలి జోన్‌లో పలుచోట్ల హెచ్చరికల నోటీసులు ప్రదర్శించినా నాయకులు, వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. ఈ హెచ్చరికలు మూణ్ణాళ్ల ముచ్చటగానే పనిచేశాయి. సచివాలయ సిబ్బంది హెచ్చరికల నోటీసులు ప్రదర్శించిన పది రోజుల తర్వాత ఆ విషయమే మరచిపోయారు. దీంతో ప్రస్తుతం భీమిలి జోన్‌లో ఎక్కడ చూసినా వ్యాపార సంస్థల పబ్లిసిటీ బోర్డులు, పోస్టర్లు, ఫ్లెక్సీలు గోడలకు, విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్నాయి. ఇంకా దయనీయమైన పరిస్థితి ఏమిటంటే భీమిలి చుట్టుపక్కల ఏ కార్యక్రమం జరిగినా తగరపువలస కూడలిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రచార వేదికగా వినియోగించుకుంటున్నారు. తగరపువలసకు ల్యాండ్‌మార్క్‌గా చిరపరచితమైన ఈ కూడలిలో 1991లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అప్పట్లో దళిత నాయకుల ప్రోద్బలంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎవ్వరు వచ్చినా ఇక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గౌరవించుకుంటారు. స్థానికంగా ప్రచార పిచ్చి ఉన్న కొందరు మాత్రం ఈ విగ్రహాన్ని తమకు ప్రచార వేదికగా మార్చేసుకుంటున్నారు. అంబేడ్కర్‌కు గౌరవం ఇవ్వడం మాట అటుంచి ప్రతీ ఫ్లెక్సీతో విగ్రహాన్ని మూసివేసి కలుషితం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు, పెళ్లిళ్లు, ఫంక్షన్లు, చావులు, సభలు, సమావేశాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, కోచింగ్ సెంటర్లు... ఇలా ఒక్కటేమిటి ఏది దొరికితే ఆ ఫ్లెక్సీ, పోస్టర్, స్టిక్కర్ ఆ విగ్రహం చుట్టూ వేస్తున్నారు. దీంతో కొందరు మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి జోన్‌లో ఏ విగ్రహాన్నీ ప్రచార వేదికగా వినియోగించుకోని వారు ఒక్క తగరపువలస కూడలిలోని అంబేడ్కర్ విగ్రహాన్ని మాత్రమే అలుసుగా తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాన్ని జీవం లేని ప్రాణంగా చూసే బదులు రాజ్యాంగ రచనా నిర్మాతగా ఆయన భరతజాతికి చేసిన మేలును గుర్తించాలని కోరుతున్నారు. జీవీఎంసీ కూడా అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలు, పోస్టర్లు, స్టిక్కర్లు అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఎస్‌ఐ చిన్నమనాయుడు

భీమునిపట్నం : జీవితాలను సర్వనాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి ఎవరూ వెళ్లొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నమనాయుడు సూచించారు. మాదక ద్రావ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు తీసుకునే వారు అన్ని విధాలుగా నష్టపోతారని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ బానిసలు కావొద్దని హెచ్చరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం : జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అవతారం విశిష్టతను వివరించారు.

మందుబాబులకు రూ.1.6 లక్షల జరిమానా

భీమునిపట్నం : భీమిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఈ మేరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు 16 మంది దొరకగా వారికి 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సౌజన్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.6 లక్షల జరిమానా విధించారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవం



అమ్మవారి ఘటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాన్ని గ్రామంలో ఊరేగించి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, టీడీపీ నాయకులు కాళ్ల నగేష్ కుమార్, కాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బబ్బేలమ్మ ఒడ్డు పండగ



పీఎం పాలెం : కారుషెడ్ కూడలిలో భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న బబ్బేలమ్మ ఒడ్డు పండగ మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాత పీఎం పాలెం, లక్ష్మీవానిపాలెంకు చెందిన మహిళలు మేళతాళాలతో అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. స్థానిక పెద్దలు పోతిన శ్రీనివాసరావు, సూర్యారావు, నాయుడుబాబు, బాలాజీ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే ప్రాణాపాయం



భీమిలిలో జడ్జి సౌజన్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

భీమునిపట్నం : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సౌజన్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం ఆవశ్యకతపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల్లో చాలా మంది అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకర విషయమన్నారు. ఈ విషయంలో ఎవరూ అజాగ్రత్తగా ఉండకూడదని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. తద్వారా వారితోపాటు వారి కుటుంబం కూడా క్షేమంగా ఉంటుందన్నారు. ర్యాలీలో డైట్ ఛాత్రోపాధ్యాయులు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎం.వి.పార్వతీశం, కార్యదర్శి కె.ఎస్.ఎం.సుధాకర్, కోశాధికారి ముమ్మిడిశెట్టి సునీల్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు నమ్మి సూరిబాబు, డి.కనక మహాలక్ష్మి, వి.అరుణకుమారి, ఏజీపీ పాత్రుడు, సీనియర్ న్యాయవాదులు భరద్వాజ్, బి.ఈశ్వరరావు, సురేష్ రెడ్డి, బాల భాస్కర్, ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



బ్లాక్ ఫిల్మ్‌తో ఉన్న వాహనాన్ని పరిశీలిస్తున్న సీఐ కాంతారావు



నిబంధనలకు విరుద్ధంగా నంబర్ బోర్డు

మధురవాడ : ఆర్‌టీఏ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విశాఖ నార్త్ జోన్ పరిధిలోని పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాంతారావు హెచ్చరించారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొమ్మాది జంక్షన్ వద్ద బ్లాక్ ఫిల్మ్‌తోపాటు నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్ ఉన్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని పరిశీలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ బ్లాక్ ఫిల్మింగ్ ఉండకూడదని, నంబర్ ప్లేట్ కూడా నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని సూచించారు. సదరు వాహనం ఫిల్మ్ తొలగిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసినా, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్‌తో సదరు వాహనదారులతోపాటు ఇతరులు కూడా ఇబ్బంది పడతారన్న విషయం గుర్తించుకోవాలన్నారు. మధురవాడ, కొమ్మాది, మారికవలస, కార్‌షెడ్, క్రికెట్ స్టేడియం తదితర ప్రాంతాల్లో నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కాంతారావు కోరారు.

విద్యా కానుకల పంపిణీపై ఆరా



భీమిలి ఎంఈవో కార్యాలయంలో విద్యార్థుల కిట్లు తనిఖీ చేస్తున్న డీఈవో చంద్రకళ

తగరపువలస : భీమిలి మండల విద్యా శాఖ కార్యాలయాన్ని మంగళవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించి విద్యార్థుల కిట్లను పరిశీలించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు కిట్లు పంపిణీ చేశారా..? లేదా..? అని ఆరా తీసి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. అంతకు ముందు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడుతూ కిట్లు పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు అర్థం చేసుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. జూనియర్ కళాశాలల్లో కూడా కిట్లు పంపిణీ చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆమె వెంట ఎంఈవోలు శివరాణి, జయప్రద, నోడల్ అధికారి అప్పలనాయుడు ఉన్నారు.

పద్మనాభం : మండల విద్యా శాఖ కార్యాలయాన్ని జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ కాంప్లెక్సుల పరిధిలోని పాఠశాల నుంచి వచ్చిన స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. యూడైస్ ఎంత వరకు చేశారో కంప్యూటర్‌లో పరిశీలించారు. ఆమె వెంట సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో అప్పలనాయుడు ఉన్నారు.

పంచ గ్రామాల భూసమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సింహాచలం: పంచ గ్రామాల భూసమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితుల సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అడవివరంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో కలిసి బీఆర్‌టీఎస్ బాధితులతో గంటా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ పంచ గ్రామాల సమస్యకు 90 శాతం పరిష్కారం వచ్చిన తర్వాత న్యాయపరమైన చిక్కుల్లోకి వెళ్లిందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎమ్మెల్యేలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యపై చర్చిస్తామన్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితుల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. సమస్యలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలను తక్షణం అమలు చేస్తామని, అంతకు మించి ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సమావేశంలో ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు హక్కు పత్రాలతో కౌలు రైతులకు మేలు

భీమునిపట్నం : పంటల సాగు హక్కు పత్రాలతో కౌలు రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి శివకోమలి అన్నారు. భీమిలి మండలంలోని కౌలు రైతులు పంటల సాగు హక్కు పత్రాలు పొందే విధానంపై వీఆర్‌వోలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు పంట సాగు పత్రాలను పొందాలంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద భూ యజమాని ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, కౌలురైతు ఆధార్‌కార్డు, ఇద్దరు సంతాకాలు ఉండాలని సూచించారు. వీటిని ధ్రువీకరించిన తర్వాత సంబంధిత పత్రాలను వీఆర్‌వోకు గ్రామ సచివాలయంలో అందివ్వాలన్నారు. దీని ద్వారా పంటపై 11 నెలలపాటు కౌలు రైతుకు హక్కు ఉంటుందని, వీరికి పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందుతాయని తెలిపారు. ఈ పథకం కింద అర్హులను వీఆర్‌వోలు ఆయా గ్రామాల్లో గుర్తించాలని, రైతులు ప్రయోజనం పొందేలా చూడాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల జారీలో అవకతవకలు

తగరపువలస : భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీటిన్‌పేటలో విద్యుత్ మీటర్ల జారీలో సంబంధిత భీమిలి విద్యుత్‌శాఖ అధికారులు వివక్ష చూపుతూ అవకతవకలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి సెయింట్ పీటర్ చర్చి ఎదురుగా ఇటీవల నిర్మించిన గ్రూప్ హౌస్‌కు ట్రాన్స్‌ఫార్మర్ లేకుండానే ఏడు విద్యుత్ మీటర్లు మంజూరు చేశారని... సాధారణంగా గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్లకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా విద్యుత్ మీటర్లు జారీ చేయరన్నారు. అలాంటిది ఇక్కడ గ్రూప్ హౌస్ యజమానికి ఇబ్బంది లేకుండా ఒకేసారి ఏడు మీటర్లు మంజూరు చేశారన్నారు. అప్పటికే ఈ ప్రాంతంలో లో ఓల్టేజీ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, అలాంటిది ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా గ్రూప్‌హౌస్‌కు ఎలా అన్ని మీటర్లు మంజూరు చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచారసభ సెప్టెంబరులో నిర్వహించే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువును పెంచినట్టు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ పరీక్షలకు అపరాధ రుసము లేకుండా ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఉచిత శిక్షణ, మిగిలిన వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని సూచించారు.

బీఎస్ రావుకి ఘన నివాళి



శ్రీచైతన్య స్కూల్ ఆవరణలో మొక్కలతో విద్యార్థులు, సిబ్బంది

మధురవాడ : శ్రీచైతన్య విద్యా సంస్థలల అధినేత డాక్టర్ బీఎస్‌రావు ప్రథమ వర్ధంతిని మంగళవారం బక్కన్నపాలెం రోడ్డులోని మధురవాడ బ్రాంచిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ సందీప్, ఇతర ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్ రావు జీవితం నేటి విద్యార్థులకు స్ఫూర్తి దాయకమన్నారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



చిప్పాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మంగళవారం ఆమె భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా 10వ తరగతి విద్యార్థుల గదిలో ప్రవేశించి బయాలజీ, గణితం, హిందీ, ఫిజిక్స్ నోట్స్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం 6, 7 తరగతులకు ఏక్టివిటీలు తయారు చేస్తున్న ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం, ‘నాడు – నేడు’ పథకం కింద నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయకుమార్, ఎ.హేమసుందరరావు, ఆర్.త్రివేణి, డీవీ సత్యవతి, అనురాధ, రాజేశ్వరి, రామస్వామి, రమేష్, సునీల్‌కుమార్ తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల పక్కనే కుక్కలు

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద తీవ్రంగా వుంది. బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన ఈ బీచ్‌కు నిత్యం వేలాది మంది పర్యాటకులు దేశ విదేశాల నుంచి వస్తుంటారు. అయితే ప్రస్తుతం ఇక్కడకు వచ్చిన పర్యాటకులను పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు ఇక్కడి కుక్కలను పట్టుకున్నారు. అయితే వాటిని బీచ్‌కు కాస్త దూరంలో విడిచిపెట్టి మమ అనిపించారు. దీంతో అవి మరలా తీరానికి చేరుకున్నాయి. ప్రస్తుతం పర్యాటకులు ఇక్కడి బీచ్‌కు రావాలంటే ఆందోళన చెందుతున్నారు. బీచ్‌లో కుక్కలను కట్టడి చేయాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

ప్రభాకరరావు సేవలు మరువలేనివి



ప్రభాకరరావు, నాగమణి దంపతులను సత్కరిస్తున్న తాటితూరు సర్పంచ్ సంతోషి, పోస్టల్ సిబ్బంది

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు బ్రాంచి పోస్టుమాస్టర్‌గా 31 ఏళ్లు సేవలు అందించి ప్రజల తలలో నాలుకలా మెలిగిన దుంపల ప్రభాకరరావును ఇక్కడి ప్రజలు ఏనాడూ మరచిపోరని సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు అన్నారు. ప్రభాకర్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం చిట్టివలస పోస్టాఫీసు వద్ద పోస్టల్ సిబ్బంది, తాటితూరు వాసులు ప్రభాకరరావు, నాగమణి దంపతులను ఘనంగా సత్కరించారు. కేవలం ఉద్యోగ బాధ్యతే కాకుండా పంచాయతీలో ప్రజల కష్టనష్టాల్లో ప్రభాకరరావు దంపతులు పాలు పంచుకునేవారన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి విషయంలో ఎందరికో మార్గదర్శకంగా నిలిచారని పలువురు గుర్తు చేశారు. నార్త్ సబ్ డివిజన్ ఐపీవో జి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రభాకరరావు సర్వీస్‌లో ఎందరో జూనియర్ సిబ్బందికి ఇచ్చిన సూచనలు వారి భవిష్యత్‌కు ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో రవ్వ ఈశ్వరరావు, చిట్టివలస, భీమిలి ఎస్‌పీఎంలు ఎస్.ఆదినారాయణ, బోని చంద్రశేఖర్, పోస్టల్ అసిస్టెంట్లు పి.గోపాలరావు, కాళ్ల గౌరీశంకర్, ఎంవో పి.అప్పలరమణ, బీపీఎంలు ఎ.సుబ్బారావు, కేవీఎస్ఎన్ రాజు, జీవీఎల్ నరసింగరావు, బి.ఈశ్వరరావు, బి.వరలక్ష్మి, బి.కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి

గోపాలపట్నం : నేవల్ ఆర్మ్‌మెంట్ డిపో సివిల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు భరోసా కల్పించాలని, సభ్యుల లోన్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఎన్‌ఏడీ ప్రధాన గేటు వద్ద నేవల్ ఆర్మ్‌మెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ సివిలియన్ కోఆపరేటివ్ సొసైటి పాలక వర్గం సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. సభ్యుల లోన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయకుండా తాత్సారం చేస్తుందని దుయ్యబట్టారు. పాలక మండలి తీరు భయాందోళనలకు గురి చేస్తోందన్నారు. గతంలో పాలక మండలి సలహా కమిటీ ఏర్పాటు చేసుకుని సభ్యులకు సకాలంలో లోన్లు మంజూరు చేసేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.